# మూగజీవాలు

క్కాత్తె బాగా కస్సీకటి పడ్తుండది. వయసు మీనుండ యానాది ముసలాయి బొమ్మల సందులో ఆల్లీళ్ల గెడపలకల్లి నిక్కినిక్కి సూసుకుంటా వొచ్చిచ్చి రామయ్యగారి గుమ్మం ముంగల నిలబడ్డాడు. "రామియగోరూ?" అని పిలిశాడు. "యాడికెల్లా రబ్బా ఎవరూ అగుపియరూ" అంటా గుమ్మందాటి లోనకెల్లాడు యిశారిద్దాంవని.

రామయ్యగారు కాత్తె వుండమడిసి. పెల్లాం, ఇద్దరుముగ్గురు పిల్లకాయలూ, వత్తాపోతా సుట్టాలనం, పెద్దజాగాలో కమ్ముకునుండ పెంకుటిల్లూ, ఎట్టనైనా కాత్తె పరవాలేదన్న కుటుంబం.

ఓరగా ఏసుండ తలుపు చందులగుండా లోనుండి దీపం ఎల్తురు ముంగల సాయిట్లోకి మూర ఎడల్పున సారగా పడ్తుండది.

"ఈడెవురూ లేరేం దబ్బా?" అనుకుంటా, అయినా పిల్లజనం ఏ మొత్తల కాడన్నా ముసుగులెట్ట నిక్కిసూత్తా వుండొచ్చని, ముసలాయి కల్లు సాయిట్లో ఆడీడా కెలుకుతా బోతావుంటే వో తంబం పక్కగా ఏందో దగదగా మంది.

రామయ్యగోరిగ్గాని, పిల్లజనంతోగాని, ఇంటి ఆడోల్లోగాని, ఇట్టాటి దగదగలు యాడా తగిలుండట్టు ముసలాయిక అంతుసిక్కాగ పోటాన, ఆ దగదగ మొదలు ఏంవై, అచలెట్టుండో అని, అడుగు ముంగలకేత్తే సూపు బెంవిచ్చి ఆడది వుండట్టుండి ఎటు లగెత్తినా లగుదోలచ్చనుకుంటా, గబాల్న గాలాం ఏసినట్టు సూపుల్తో లాగబడ్డా దగదగ ఏందని యిశారనకొచ్చాడు ముసలాయి, పరీచ్చగా సూత్తా.

ఇత్తడి బిందే, పక్కన దాంకుంటా సిన్న సెంబూ కరకట్టుగా వుండయ్యాడ. ఆటి వాలకం సూత్తా నుంచుండాడు ముసలాయి, దుష్టి సెదర్నీకుండా. రామయ్యగోరి జనం యాడుందో, ఆయన యిల్లు యాడుందో, ఆ వీదేందో, అయన్నీ యింకో పెపంచకం. ఆడ ఎవురూ లేరు. ఇంకేంవిలేవు. అయ్యో, ఆటి క్కాత్తెడంగా ముసలాయీ, అంతా గప్సిప్. ఆటి వాలకం ముసలాయికి నచ్చింది. అయి బొహు గిరాకీ. మామా వోళ్లు ఆట్నీ కల్లకద్దుక లాక్కుంటారు ఆటిగ్గాను వొల్లు చరిసూసుకోను సానా వొత్తయి. ఎటుసేరీ సుకం వుంటది. బెంవతో అని పియనట్టు వొక్కాలు ముంగల కెల్లింది ముసలాయికి- గబాల్న మూర ఎడల్పు ఎల్తురు సారమీన మడిసి నీడ బడ్డది- వైకుంటాన్నుంచి బూమ్మీన సీసాకాయిపడి

పెటీల్మంటా ఏఁవయ్యేదీ తెల్పినట్టయి— "దొర్సానమ్మగోరూ !"—అ నరిశాడు ముసలాయి, చీసాకాయితోబాటు తనూ బూమ్మీనకొత్తా.

"ఎవ్వర్రా అదీ ?" అంటా వోరగా ఏసుండ తలుపు తెరుసుకుంటా రామయ్యిగారి పెల్లాం సీతమ్మ సాయిట్లో కొచ్చింది, వంటోసన గబ్బుమనిపిత్తా. "నే న్దొరసానమ్మగోరూ, ముసలాయినీ—" కాత్తె సంబాలించుకుంటుండా, మాట కరకట్టుగా రాలా ముసలాయికి.

"ఓరి నీ యిల్లు నేలగట్టా ! అంతరుపరిచావేంట్రా భయపడి చస్తేనూ ? అబ్బ, వొళ్ళు వొణుకు పుడుతున్నది ! ఏం, యిప్పుడు చచ్చావేం ? ఏరీ, ఇక్కడెవరూ లేరే ! ఎంతసేపయిందిరా నువ్వొచ్చి ? నామతి బండలుగానూ, వీధి వాకిలి వేసుకునన్నా చావనేం ? వీళ్ళేరీ ? ఈ పిల్లపక్షులేరీ ? అహోరాత్రులూ వీధుల్లో చస్తారేం, ఇంతంత లేరూ ? తలుపు బార్లగా తెరిచేవుందే ? వాళ్ళకేం కొంప గుండాన పడ్తుంటే ? అర్ధరాత్రివరకూ యీ జంఘాల శాస్త్రి వుపన్యాసాలు ఎవరికి పడ్తుందీ వూరికె పెనేసుకు తిరక్కబోతే ? రాత ! ఏఁవిట్రా ముసలాయ్ ? చీకట్లో చచ్చావేం ? ఎందుకొచ్చా ? ఇంకా నయం !" అంటా, ముక్కునా నోట్నా నీలుబోయినట్టు, వొచ్చిన కూసేపిట్లో యుద్దెం సేసింది సీతమ్మ.

"రామియగోరు లేరంటండీ ?"

"లేరే. ఏఁవో, ఎక్కడ మండపెడ్తున్నారో, ఈ మెరుగుదిమ్మెలవాళ్ళకి పొద్దుకూకులూ పొడుంకాయ వెంటవుంటే సరి, పెళ్ళాం పెట్ట దిమ్మలూ వూడ్చిపెట్టుకుపోయినా సరే ! బాగానేవుంది మేళం ! ఇప్పుడెందు కొచ్చావురా ముసలాయ్ ?"

"అఁ, ఏం లేదండి దొరసానమ్మగోరూ, మరేవోఁ—నా నేవోఁ—"

"నాబొందా నీబొందా ! నత్తిముండాకొడకా ! తెవిఁల్చిచావ్వేరా తొందరగానూ ? ఆ ఎసరు మండి చచ్చిందో లేదో ! నా పిండాకూడు మీదకి యీ పచ్చి కట్టెల్ను మాడపెట్టారేం - ముష్టిబతుకూ ! నూ పోరా, ఆయ నింట్లోలేరూ ! రేపురా పో ! పద, తలుపు దగ్గరగా వేసెల్తాను-ఒరె పుంద్రా ముసలాయ్ ! కొంచెం రెండు కడవల నీళ్ళు తోడిపెట్టిపో నాయనా. నీకు పుణ్యం వుంటుందీ ? ఇంతలో ఆయనగారొస్తే రావచ్చుకూడా, వుండు కడవ తెచ్చిస్తాను. అయ్యో నా తెలివి మండా ! ఈ బిందే చెంబూ ఇక్కడే వున్నయ్యే ? ఇంకా నయం కరువురోజుల్లో ! మంచి ఘడియే ! ఈ చచ్చినవాళ్ళు ఎక్కడికిపోయి చచ్చారో ? వుంద్రా ముసలాయ్."

అంటా, ముసలాయి యాడన్నా మారుపడ్తాడేవోఁ అన్నట్టు, దబ్బున

లోనుండి లాంతరుదెచ్చి, తంబానికి పక్కన వూగుతావుండ కొంకి సువ్వకు ఏల్లాడేసి, యిం కూసేపిట్లో బుంగ తెచ్చిత్రా, "ఆ రొండుతొట్లు నింపుదూ నీకు పుణ్యం వుంటుండీ," అన్నది సీతమ్మ, ఆడే నిలబడ్తా.

"నే సేసేత్తాలే దొరసానమ్మగోరూ, నిమట్లమీన లాగెయనూ ?"

"ఇదిగో, లాంతరు కావలెగా. నువు కానీలే కొంచెం యిక్కడే నుంచుంటా. నీ పెళ్ళాం కాపురాని కొచ్చిందిట్రా ?"

"ఆఁ, ఏందో లేండీ !"

"ఓరి నీ సిగ్గుమండా ! వొచ్చింది కావల్నూ, మంచిదేనట్రా నీ పెళ్ళాం?"

"గూడెంలో ఆల్లట్నే అంటారండీ !"

"వుఁహూఁ ! పేరేవిఁట్రా ?"

"వూఁ—"

"మురిసి చస్తున్నావేంట్రా వెధవా ? మాలోనే లేదూ అంత బెట్టూ !"

"ఆఁ, ఏందోలెండి దొరసానమ్మగోరూ ! చెసిరేకంట దానిపేరూ !"

"చెప్పవేం అట్లా ? భలేదాన్ని సంపాదించా వన్నమాటే ! పేరు కొంచెం నాజూగ్గావుంది, బస్తీపిల్లేవిఁట్రా ?"

"యాద్దండీ ! ఆల్ల పెద్దమ్మ చెసిరేకంట లెండి."

"ఓహో తెలిసిందిలే.—ఆఁ ఆ కడవ అక్కడే బెట్టు. కొంచెవేఁ, అపాకలో పిడక లున్నయ్యా, తెట్టె అక్కడేవుందిలే. తెచ్చి ఈ సావిట్లో పెట్టు నాయనా ?"

"చాల్లే నాయనా, ఇహ యీ పిల్లలొస్తారు కావల్ను ప్రాణాలు తోట్టానికి. కొంచెం ఆ నాలుగు మంచాలు యిట్టా బయట పడవేసిపెట్టూ, వంటింట్లో వుండే నన్నిట్లా పిండుతారూ !"

"సందే లవుపియ మన్నారండీ, రామియగోరూ —"

"ఏరీ ? ఎక్కడ వుట్టిగట్టుకు వూరేగుతున్నారో !"

"ఆఁ, పొద్దు నవుపిత్తేనూ —"

"ఇహ పనేవుందీ బుజాలెగరేసుకుంటూ !"

"ఓ పావల్లబ్బుల్లయి సెలుమన్నానండీ."

"నా బొంద ! ఇట్టా చచ్చిపోతున్నానేం పొయిమీద ఎసరుపెట్టొచ్చీ ? వొచ్చారంటే తాతల్దగ్గరినుంచీ సమర్థించాలి యీయన్తో ! ఏరీ, వొస్తేగా ఏ వేళకీ ? పదీ పదకొండుగ్గానీ నా చావు నిద్చావు కాదాయెను ! తేపొద్దున కనుపించరా ముసలాయ్ ?"

"కాత్తేవఁన్నా—బియ్యగ్గింజుంటే—"

"ఈ మడి మండిపోతుండె! అన్నీ మెల్లోనే చస్తయ్యాయను! రేపెప్పుడయినా యిటు కనుపించుతావుగా? ఇదిగో అటు పోతున్నావు కావల్నూ, ఆ దర్భలవాళ్ళింట్లో మా పిల్ల లుంటారు. కొంచెం కేకెయి నాయినా, మీ అమ్మ చంపుతుంది రమ్మనమనీ?"

* * *

"చీతారావమ్మగోరి పిల్ల లీడకు రాలేదంటండీ?" అనడిగాడు ముసలాయి, దర్భలోరింటి గుమ్మం ముంగల నిలబడి లోనకు తొంగిసూత్తా.

"ఎవ రదీ?" అని పెశ్నేశాడు, లోగిలి ముంగలి కాలీపెదేశంలో మంచంమీన కూకునుండ దర్భల చుబ్బయ్యగారు.

"నే ముసలాయినండీ దొరగారూ, ఆలపిల్ల లీడకొచ్చారంటగా? ఆ చీతమ్మగోరి పిల్లలండీ? కాత్తె కేకెయిరా అంటేనూ—"

"నువ్వట్రా ముసలాయ్! ఒరే ఒక సారి యిటోచ్చిపోరా? వాళ్లపిల్లలు ఇంతకుముందరే వెళ్లారే! రాఘవయ్యగారి పిల్లల్తో వెళ్ళినట్టుంది! ఈపాటికి యింటికి చేరుకుంటార్లే. ఇటొచ్చి కూచోరా కొంచెం-అబ్బా-యీ కుడికాలి గిలకదగ్గిర బెణికిందిరా—అబ్బ-బ్బ- ఆయువుపట్టును లాగేస్తున్నదిరా తండ్రీ! వుస్—సీతారామచంద్రమూర్తి - నన్ను బతకనిచ్చేట్టులేదురా ముసలాయ్!"

"మా వాపు వాసిందే దొర! దెబ్బేడ దిన్నారండీ దొరా?"

"మెట్ల దగ్గిర కాలు జారిందిరా నాయనా! ఏం పాపం బద్దలయిందోరా రామయ్యతండ్రీ! కాస్త చూడ్రా ముసలీ? అబ్బా-ఏవేఁవ్ ఇదుగో ఆఁ! నిన్నే పిల్చేదీ? కొంచెఁ, ఆ ఆముదపు డబ్బా యిటు పట్టుకురా?"

"బాగానే వుంది ముచ్చట! పుట్టినన్నాళ్ళకు పురుషుడు యెగ్గెం చేశాట్ట! ఆ రాగాత్రియట మేవిఁటీ, ఆ వెఱ్ఱికేక లేవిఁటి, పక్కింటి వాళ్ళ వింటానికి? అట్టా గొంతుచించుకుంటా రెందుకూ వంటింటో వూపిరాడక చస్తుంటేనూ? పీడెవడూ?"

"ఎవడోలే! అయినా మరీ నీతో యమచరగా వుందేవిఁటీ? ఓ చెంప బాధతో చస్తుంటే ఆ ఎగురుడేవిఁటీ? ఆ డబ్బా అక్కడ పెట్టిపో, మహా నువ్వే గాంగ అర్చి తీరుస్తున్నట్టూ! బాగానే వుంది!"

'అబ్బే, మాకేం తెలుస్తుందీ, తెల్లవార్లేస్తే రంగరించి పొయిటంతప్పా-?'

"యిహ చాల్లే పదా, పళ్ళు రాలేను-ఆఁ, ఆఁ! ఆ డబ్బా చూడ్రా ముస

లాయ్-వొలికిందా? ఎక్కడో దుర్గాంబ మా పాలిట పడ్డదేం! కొంచెం మెల్లిగా రాయి నాయనా? వుస్-రామచంద్ర ప్రభూ!"

'జనం అల్లాడిపోతుంటే యాడ సూసినా! కట్టకాలవైపోయింది దొరా.'

'ఈ రోజుల్లో బలం గల మనిషే ఏడ్రా! ఎక్కడ చూచినా సోమరిపోతు సంఘాలు. అసలు ఇంటికో రోగి లేందే యీ డాక్టర్లు ఇంత పుణ్య పురుషులై కూర్చుంటారుట్రా? మా తాత తవ్వెడు బియ్యం, మూడు గిద్దెల పప్పూ, సోలెడు నెయ్యీ, బుట్టెడు గారెలూ, తవ్వెడు పెరుగూ తినే మనిషి. మన ఊరి విష్ణు రథాన్ని వొంటిగూడుతో హుమ్మని పట్టుబడ్తే అది మోటారు బండిలాగా పరుగెత్తిందని యిప్పటికీ మనం అనుకోటం లేదట్రా? అబ్బ-అబ్బ! కొంచెం నింపాదిగా తోమరా తండ్రీ! ఇంతకూ కలియుగం అంతాని కొచ్చింది! అంతకన్న మరి ఏం లేదు!'

"నాట్లయినాల్టి నుంచీ యియ్యాల్దాకా, మళ్లీ కూల్డబ్బులు కాన్రాకబోతే, ఏం బతికేట్టు దొరా?"

"ఎక్కడో ఆ మహానుభావుడు వసంత దేవరాయలై జన్మించబోతున్నాడు! యీ రాక్షస జాతిని చండాడక మానడు! కృతయుగారంభం!"

"మా గూడెంలో కూడొండుతున్నట్టు యాడన్నా కంటి కాపిత్తే సీపియ్యండి, ఈ సెవి కోసేసుకుంటానో లేదో?"

"భూకంపం! జన నాశనం! రాక్షస సంహారం! శంకర దర్శనం! ధర్మం నాలుగు పాదాలమీదా నడిచి తీరాలి!"

"పొద్దు పాతండది దొరా! నిన్న పొద్దుటాల్నుంచి కూడు తినక, అల్లాడిపోతండాం-"

"అరెరే! పొద్దు పోయినట్టే వుందే? ఇహ చాలుగానీ, కొంచెం ఆ చేత్తోనే అరిపాదాల్ని యిట్టే అనిపో. ఏఁవే-ఒరే కనకం! నీళ్ళు కాగినయ్యేమో కనుక్కోరా మీ అమ్మనూ?"

"రామియగోరు ఓ పావల్డబ్బు లిత్తాన్నారు గ్గానీ, ఆయిన నిసిరే త్తిరిగ్గాని రాదంటా, చీతమ్మగోరు సెప్పిందండీ. ఇద్దరం నిన్నటాల్నుంచి కూడు తిన్లేదండీ. కాత్తె-ఏఁవన్నా దయిసేయండి దొరా!"

"అరెరె పాపం! యింట్లో అసలేమీ వున్నట్టు లేదే? యిప్పుడేం జేసి చచ్చేట్టు! వుదయం ఆ శేషయ్యగార్ని బతిమాలి బతిమాలి ఓ రూపాయి తెస్తే, ఆ నెయ్యిం పాపిష్టిముండ కాస్తా, దాని సొమ్మంతా ఎగేసినట్టు నానా మాటలని,

అది కాస్తా తన్నుకుపోయె ! అబ్బ ! కాస్త పచ్చడన్నా దొరుకుతుందేమో కనుక్కుని చూస్తానుండు ! ఒరె కనకం !"

"ఆఁ, ఏవిఁటికిలే దొర ! కూసిని బియ్యం వుంటే ఇప్పియ్యండి సాలు-"

"వస్తున్నాఁరా నాయనా ! నేనేమో కుంటికోడినై కూచుంటినీ ! వీళ్ళ పిల్లవాణ్ణి పంపుతే వస్తారుట్టా, పాతర తీయించాలని వారం నుండి కొట్టుకుంటుంటే యింతవరకు అతీ గతీ లేదు. అన్నీ బదుళ్ళే ! ఎక్కడ జూచినా బదుళ్ళే ! నాశనం ! అబ్బ-సీతారామచంద్రమూర్తి-రామయ్యా యీపాటికి వొచ్చి వుంటాడేమో ఒక్క అడుగు వేసి చూద్దూ ? ఆఁ, ఎప్పుడయినా యిట్లాగే కనిపిస్తూ వుండరా-అబ్బ, రామయ్యా తండ్రీ."

* * *

ఆదరాబాదరా రామయ్యగారు యింటికొచ్చి, పీ నేసుకుండ గుడ్డల కాణ్ణుంచీ లోన చరమందాకా పూరెవారాల్తో మునిగుండట్టు "నీళ్ళతోడే సెయ్, గుడ్డల్దీసిబారెయ్, కట్టుకోను గుడ్డా, ఒడ్డిచ్చే సేయ్ !" అ నావజాన అయీ, యియీ, ఏయీ, పుడిసికి ఎంతలెక్క ఒంటబట్టిందీ తెలవకుండా వుండే యవదానంలో- "మాపిటిపూట అగుపియమంటిరే దొరా ?" అంటా తలుపు తట్టి ముసలాయి యిశారిత్తే, "అబ్బ బ్బ బ్బ బ్బ బ్బా ! రేపిస్తాలే పోరా, అబ్బబ్బబ్బబ్బా ! సరిలే రేపు రారా, అబ్బబ్బబ్బా-" అంటా గొణ గొణ గొణ లోనుంచి మోత పుట్టేతలికి, యాల మిగిలిపోయిం దనుకుంటా, సందు దాటి బజార్న బడ్తా, సల్లగా సెంచయ్య దుకానం కాడికొచ్చి, లోనుండ సావుకారు కగుపిత్తా ఓ మూలగా నిలబడ్డాడు ముసలాయి, వఁరేత్తా. "పొద్దున కట్టెలు పగలేస్తాన్న మనిషివి పత్తాలేకుండా పోయినా వేందిరా ముసలాయ్ ?" అన్నాడు సెంచయ్య, దుకాణం సవిరిచ్చుకుంటా, ముసలాయి నోకంట సూసి.

"ఈ యానాదాళ్ళ పస్తన్నా పండుకుంటారు గాని, నీకూ నాకూ పలుకుతారంటయ్యా ?" అంటా కొట్టుకు బేరాని కొచ్చిన ఓ పెద్దమనిషి రైతు కొడుకు, పుగాకుపాయ యీనల్దీత్తా, ముసలాయిమీద తన అభిప్రాయం కాత్తె సిన్న యిసురుగా సూసి యిసిరాడు, అట్ట అనాల్సిందే అన్నట్టు.

"రేపెయిమంటే ఎయి నంటండి సావీఁ ? కాత్తె ఆ రీరుపిలుత్తే నాలు గ్గింజలు వుత్తయ్యాసి ఐవేఁగానీ, లేకుంటే నాలుగు పేళ్ళేసి బెడ్తే యాడేం బంగారం వొరుగు ద్దంటండీ ? రేపట నే ఏసిత్తాలే సావీఁ."

"మొత్తానికి మీరా మనగాళ్ళు! అహఁ, మనిషిని నమ్ముకుంటే బేరాలింతే గదాంటా! సరే చూస్తాగా! కొంచెం యీ తౌడు బస్తాలు లోపలికి పట్టూ!"

"పద్తా గానీ–కాత్తె నాకేఁవన్నా కొలిపియ్యండీ, నిన్నటాల్నుంచీ కూడేలేదూ! రేపు మాపిటాలకల్లా మీది మీ కిచ్చేత్తాగా?"

"నికాల్సయిన మాటన్నావు, తరవాత ఎట్టుండా" అన్నాడు పెద్ద మడిసి రైతు కొడుకు, సుట్ట సుట్టి పంటిన పడ్తా.

"మంచోడివి! కర్పూరం ఎలిగించి అంతా అయిపోయినాకా అప్పు సొప్పు? ఈ రోజుకున్న పెద్దమనుషుల కాతాలు చూస్తే, మేం ఏం యాపారం చెయ్యాలో ఎట్లా బతకాలో యింతవరకూ అంతుపట్టటంలా! ఏందీ యీ బేరాలూ! ఎన్నాలేడిత్తే తీరేనూ? కొంచెం వీటిసంగతి చూడూ? రేపురా-నువ్వూ నేనూ యిక్కడుండే వోళ్ళమేఁగా."

"కాత్తె ఎటనయినా సూడండి సెంచియగోరూ! పానం పాతండదీ!"

"ఇహ అదే వరసా వేళా పాళా లేకుండా? ఇంతకూ బస్తాలు లోపలేస్తానంటావా లేదంటావా?"

"ఏడ్పొత్తుంతది సాఁవీఁ, వొల్లు నీలుగారుకుంటూ! కాత్తేవఁన్నా పెట్టండీ."

"ఇందరా పుగాకూ, కొంచెం బెల్లంవుంటే పెట్టు సెంచయ్యా! పో, పో, యాడన్నా తంటాలుబడు, పో—."

* * *

"యాడికయ్యా నూ ఎల్లేఁదీ? ఈయాల్దాకానూ యాడుండటసలా? కూడెట్టలేనోడియి, నన్ను సంపుకుదింటం దేనికిగ్గానయ్యా నన్ను పంపియ్ మా అయ్యోల్లకాడకూ. ఎవురుంటారయ్యా-" అంది చెసిరేక, ముసలాయి కంటి కగుపియ్యగానే మోర పైకెత్తుతా.

"ఏందమ్మోవ్ నీయ్యాటా? రంపు సాగిద్దువులే లోనకు బా" అన్నాడు ముసలాయి సిరాకుతో కాలీ సేతులు జాడిత్తా.

"తాలూ! తా లుండూ- మా యింటికి బోతా."

"యాడికే-నూబొయ్యేదీ? ఓసి పాయే మా గాంగా-ముద్దు సేత్తుంటేనూ!"

"ఆఁ నూయే ఆడ సేసేదీ! కడు మ్మాడ్సి సంపుతా. తాలూ-నెడ్తా దేందమ్మా!"

"లోనకు పాయే, ఎటనోకట్ట సద్దాం."

"ఆఁ యీడ సావటానికే ఒచ్చింది! ముంగల సెయ్యోదులు–గుంజుతా

వేడకి? వుండకాడా-తలుపేత్తా వెందుకూ-నే నుండనయ్యా లోనా!"

"కూకో! పెయిదూడకుమల్లే ఎగుర్తుండావుగాని-ఏందమ్మోవ్ నీపని మా లావుగుంది! కూకో ఆ వజానా?"

"ఆరుత్తా—"

"పొళ్లూడ్తయ్, జాస్తిగా లేశావంటే!"

"ఆఁ! అంతటోడివే! సంపెయిరాదూ సెనేశరం వొదులుద్దీ? కడుపు గాలి సత్తుంటేనూ!"

"లేదులే వుండే. మన కేందో సెన్దగిలింది లేయే! ఆదేన్దిగానీ, పన్జేసినా యిచ్చి సావకపోతే నానేం మడిసిని గాదంటే? మరేవిఁటికమ్మా నీ వగలూ? కాత్తె సద్దుకు పావద్దంటే?"

"అయినా యీడేవోఁ మా దరిద్దం గుండదయ్యా! యాడ సూసినా పోసి కోలు సంచేందీ? సీ, ముదనష్టకం!"

"పాయే, నీ కొల్లు మా బొచ్చిందీ? కాత్తె ఆ బామ్మల గెడపకల్లి ఎల్లవే అంటే, నీకు అలివయ్యిద్దంటే పనీ?"

'ఆల్లతో మాసావయ్యా! ఏ కాడికీ దీర్గాలు దీత్తా నాన్ని సంపుతారూ! ఈతాకులు తెచ్చీవియ్యా! సాపలల్లుతా, అంటుంటే ఈలే అవటంలా అయ్యకు!"

"ఎంబడీబడి నడువిరుసుకుంటే లేదుగానీ యీవేందో యాపారం సేసుద్దంట! పానీలేయే! దినం కల్చిరా కేడికి పోద్దీ? బగమంతుడుంటాళ్ళే అందర్నీ కంట కనిబెడ్తా!"

"తెల్లార్గావుఁన నన్నూ ఎంటదీసి కెల్లయ్యా, యాడన్నా పన్దేవులాడ్తానూ?"

"అది గాదంటే నే యిన్నాలూ సెప్పేదీ? ఆ బుట్టలో పచ్చాపలు యింకూసి నుండాల గదంటే-?"

"అబ్బ వుండయ్యా! తెత్తానూ-"

"బామినీలేదో, పానుపూ మీ...యీ...దా-?"

"........."

"సిగ్గాయనే బిగ్గాయనే, సిత్త రేకా సెప్పూటకూ-"

★